సామాన్యుడి ఆయుధం

# తెలంగాణ ప్రభ

గురువారం, ఏప్రిల్ 25, 2024

డిజిటల్



## హరీశ్‌రావు రాజీనామా పత్రం

# జేబులో పెట్టుకో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2 లో

ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేసి తీరుతా..



- బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్
- మిర్యాలగూడ రోడ్డు షోలో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేత
- పేగులు మెడలో వేసుకుంటాం... గుడ్లు పీకుతాం... ఇదేనా సీఎం మాట్లాడే భాష అని ఆగ్రహం
- మనం మళ్లీ అధికారంలోకి వస్తాం...
- ఇందులో అనుమానం లేదన్న కేసీఆర్

3 లో

## నన్ను చర్లపల్లి జైల్లో వేస్తామని అంటున్నారు..

# నేను భయపడతానా?

## నన్ను చర్లపల్లి జైల్లో వేస్తామని అంటున్నారు..

# నేను భయపడతానా?: కేసీఆర్

**తెలంగాణ ప్రభ, మిర్యాలగూడ** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. బస్సు యాత్రలో భాగంగా బుధవారం ఆయన మిర్యాలగూడలో మాట్లాడుతూ... తెలంగాణలో తన ఆనవాళ్లు లేకుండా చేస్తామని చెబుతున్నారని... చర్లపల్లి జైల్లో వేస్తామని అంటున్నారని... అలాంటి వాటికి నేను భయపడతానా? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదిహేనేళ్లు కష్టపడి తెలంగాణను తెచ్చుకున్నామని... అలాంటి తనను జైల్లో వేస్తామంటున్నారని వాపోయారు. పేగులు తీసి మెడలో వేసుకుంటాం... గుడ్లు పీకి గోళీలు ఆడుతాం... ఇదేనా? ముఖ్యమంత్రి మాట్లాడే భాష అని ధ్వజమెత్తారు.



ప్రజలు ఆలోచన చేసి ఓటేయాలని కోరారు. అన్నీ అబద్దాలు చెబుతూ.. అబద్దపు శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ పుణ్యమా అని మనకు తెలంగాణ వచ్చిందని... అందుకే ఆయన గౌరవార్థం అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. మొన్న అంబేద్కర్ జయంతి రోజున అక్కడకు ముఖ్యమంత్రి, మంత్రులు ఎవరూ వెళ్లలేదని మండిపడ్డారు. మనం తప్పకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని... ఎలాంటి అనుమానం లేదన్నారు. మనల్ని ఎవరూ ఆపలేరన్నారు.

మనం కలగన్న బంగారు తెలంగాణ నిర్మాణమయ్యేదాకా కొట్లాడుదామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఎక్కువ సీట్లలో గెలిపిస్తే అది తెలంగాణ ప్రజల బలం అవుతుందన్నారు. మీ తరపున ప్రభుత్వాల మెడలు వంచగలుగుతామన్నారు. మే 13వ తేదీ వరకు ఇదే ఉత్సాహం కొనసాగించి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పది పన్నెండు ఎంపీ సీట్లు గెలిస్తే తెలంగాణలో భూమి ఆకాశం ఒకటి చేసినంత పోరాటం చేస్తానన్నారు. మీరిచ్చే బలంతో కేసీఆర్, బీఆర్ఎస్ పోరాటం చేయగలుగుతుందన్నారు.

బీఆర్ఎస్ హయాంలో రెప్పపాటు కూడా విద్యుత్ పోలేదన్నారు. ఇంకా మిగులు విద్యుత్ ఉండేలా చూశామని తెలిపారు. మిషన్ భగీరథను ఇప్పుడు సరిగ్గా నడపలేని పరిస్థితి నెలకొందన్నారు. రైతుబంధు గురించి అడిగితే చెప్పుతో కొడతానని మంత్రి చెప్పడం విడ్డూరమన్నారు. చెప్పులు కేవలం మంత్రుల వద్దనే కాదు... రైతుల వద్ద కూడా ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించారని ఆరోపించారు. రైతుబంధులో దగా చేశారని, రైతుబీమా ఉంటుందో ఊడుతుందో తెలియదన్నారు.

### కేసీఆర్‌కు తప్పిన ప్రమాదం...

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర చేస్తోన్న కేసీఆర్ మిర్యాలగూడకు బయలుదేరారు. ఈ సమయంలో వేములపల్లి వద్ద ప్రమాదం జరిగింది. దాదాపు అన్ని కార్ల బ్యానెట్లు దెబ్బతిన్నాయి. ఓ వాహనం డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఒకదానికొకటి ఢీకొన్నట్లుగా ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.







## కార్మికుల హక్కులకై మేడే జయప్రదం చేయండి

**సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ పిలుపు.**

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వాల్ పోస్టర్లలను ఆవిష్కరించారు. ఈ. వాల్ పోస్టర్ల కార్యక్రమం సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఏ. విట్టల్ గౌడ్ మాట్లాడుతూ... మే ఒకటి తేదీన కోటగిరి బస్టాండ్ ఆవరణలో 138వ. మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని కేంద్రంలో ఉన్న నరేందర్ మోడీ కార్మికుల వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్మికులను రోడ్డున పడేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగాలన్నిటిని ప్రైవేటీకరణ చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధాలను అంతం చేయాలని అందుకు కార్మిక కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని మేడే స్ఫూర్తిగా ముందుకెళ్లాలని పిలుపునిచారు. మేడేకు కార్మిక సంఘాలు హమాలీ తాపీ మేస్త్రి వర్కర్స్ యూనియన్ ఎలక్ట్రికల్స్ ప్రింటర్స్ కార్మికులందరూ పెద్ద ఎత్తున వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటియూసి నాయకులు నల్లగంగాధర్ సున్నం భరత్ ,సిపిఐ నాయకులు జి. రాజు మాస్కుల గంగారం, గొడుగు హన్మాండ్లు, కప్ప సాయిలు వసీం తదితరులు పాల్గొన్నారు.



## రేణుక ఎల్లమ్మ సిద్ధోగాకి హాజరైన ఎమ్మెల్యే కేటీఆర్

**తెలంగాణ ప్రభ, (తంగళ్ళపల్లి);** తంగళ్ళపల్లి మండలం గోపాల్ రావుపల్లె గ్రామంలో బుధవారం జరిగిన ఎల్లమ్మ సిద్ధోగా మహోత్సవానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ కు ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లినీ ఎమ్మెల్యే కేటీఆర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించార. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస రాజు, మండల పార్టీ అధ్యక్షులు రాజన్న, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగు మామిడి వెంకట రమణారెడ్డి, డైరెక్టర్ మిరాల భాస్కర్ యాదవ్, ఎంపీటీసీ దుర్గాప్రసాద్, నాయకులు, ఎసి రెడ్డి రామ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



# రాహుల్, ఒవైసీ ఇద్దరూ ఔరంగజేబు స్కూల్ వాళ్లే

- కవిత నిర్దోషి అయితే బెయిల్ ఎందుకు రాలేదు
- హామీల అమలులో రేవంత్ సర్కార్ విఫలం
- కేంద్రమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్



**తెలంగాణ ప్రభ (హైదరాబాద్):** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీలు ఇద్దరూ ఔరంగజేబు స్కూల్ కు చెందిన వాళ్ళేనని కేంద్రమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ధ్వజమెత్తారు. గతంలో బీజేపీ మహిళా అభ్యర్థి చేతిలో రాహుల్ గాంధీ ఓడిపోయారని, అదే విధంగా ఇప్పుడు హైదరాబాద్ లో కూడా తమ పార్టీ మహిళా అభ్యర్థి చేతిలో ఒవైసీ ఓడిపోవడం ఖాయమని ఆయన అన్నారు. వయనాడులో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాహుల్ గాంధీ ఓడిపోతారని అన్నారు. దేశ వ్యాప్తంగా 40 సీట్లు గెలవడానికే కాంగ్రెస్ తిప్పలు పడుతుందని ఆయన విమర్శించారు. గత 60 ఏళ్ళలో కాంగ్రెస్ చేసిన దానికంటే పదేళ్ళలో నరేంద్ర మోడీ సర్కార్ చేసిందే ఎక్కువని ఆయన తెలిపారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో కేంద్రమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ మాట్లాడారు.. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో నిర్దోషి అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఎందుకురాలేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో దోచుకున్నది చాలదన్నట్లుగా ఢిల్లీకి వెళ్ళి దోపిడీకి బీఆర్ఎస్ నేతలు పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. అనేక హామీలతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మభ్య పెట్టిందని ఆయన దుయ్యబట్టారు. ఇచ్చిన హామీల అమలులో సీఎం రేవంత్ సర్కారు ఘోరంగా విఫలమైందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సనాతన ధర్మాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రపన్నుతోందని ఆయన ఆరోపించారు. కర్ణాటకలో సొంత పార్టీ కార్పొరేటర్ అయిన ఓ ఆడబిడ్డకు న్యాయం చేయలేని రాహుల్ గాంధీ సామాన్య ప్రజలకు ఏం న్యాయం చేస్తారని నిలదీశారు. మహిళల సంక్షేమం పట్ల కాంగ్రెస్ వైఖరి ఏమిటో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.